క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ మార్కెట్ యార్డు ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, సాజీద్‌పుర, వీవీనగర్, శ్రీనివాస్‌నగర్, సుబాష్‌రోడ్డు, ప్రాంతాలలోను, ఓల్డ్ బస్టాండ్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా గణేశ్‌నగర్, మోహినిపుర, ముర్షద్ గడ్డ, 42వ వార్డు, గద్దబొమ్మ, కాంచీట్‌చౌరస్తా ప్రాంతాలలోను మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో స్వాతి మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా అర్చకులు విశేషాభిషేకం జరిపారు. పట్టువస్త్రాలు, పూలమాలికలు, సర్వాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు.

వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఏసీపీ సతీశ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సిబ్బంది అప్రమత్తంగాఉండాలని సూచించారు.

స్ఫూర్తిదాయకంగా నిలవండి


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: ఇప్పటి వరకు 60 సార్లు రక్తదానం చేసిన మున్సిపల్‌కు చెందిన కార్మికుడు శ్రీకాంత్‌ను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సోమవారం అభినందించారు. వరంగల్‌లోని మదర్ థెరిసా బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఓ పేషెంట్‌కు రక్తదానం చేయడంతో అతడిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో రక్తదానం గొప్పదన్నారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఎల్లవేళలా ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ఇలానే స్పందించి సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు.

టీకాలు వేసిన విద్యార్థినులు


జీవాలకు టీకా వేస్తున్న విద్యార్థిని

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం గంగాపూర్‌లో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించారు. మూడు వేల జీవాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.పరశురామ్ మాట్లాడుతూ పశువులు, జీవాలకు వచ్చే వివిధ రకాల వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువుపై హక్కులు ముదిరాజ్‌లవు..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ఖాజీపూర్ చేపల చెరువునకు సంబంధించిన పూర్తి హక్కులు ముదిరాజ్‌లవేనని మత్స్యకార కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పెండెల రమేశ్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ముదిరాజ్‌లకు హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన అనుమతి పత్రాన్ని సొసైటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు భూపతి, గణేశ్, రమేశ్, శేఖర్, వేణు, కుమార్, పాల్గొన్నారు.

వర్గీకరణ అమలుపై హర్షం

దౌల్తాబాద్(దుబ్బాక): అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసి మాట నిలబెట్టుకున్నందుకు దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు సింహాచలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. స్వామి, విజయ్, రాజు, వంశీ, రాజశేఖర్, ఐలన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నీళ్ల పంచాయితీ

ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన నీటి విషయంలో పంచాయతీ సిబ్బంది చేతివాటం చూపించారు. యథేచ్ఛగా పైపులు వేసి ప్రైవేట్ వ్యక్తుల పొలాలకు అందజేసి సొమ్ము చేసుకొన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే దీనికి కారణమని స్థానికులు వాపోతున్నారు.

- ప్రైవేట్ వ్యక్తులకు బావినీరు అమ్మకం
- యథేచ్ఛగా పైపులు వేసి దందా
- చక్రం తిప్పుతున్న సిబ్బంది

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బావి నీటిని రూ.5 వేలకు అమ్మేసి పంచాయతీ సిబ్బంది జేబులో వేసుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని మోయతుమ్మెద వాగులోని పంచాయతీ బావినీరే ప్రజల అవసరాలు తీరుస్తుంది. వేసవి కావడంతో తాగేందుకే సరిపడా నీరు రావట్లేదు. ఈ క్రమంలో ఆ నీటిని పలువురు పంచాయతీ సిబ్బంది బావి నీటిని పంటపొలాలకు అమ్ముకొన్నారు. పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఒకరిద్దరు సిబ్బంది ఈ తతంగం అంతా నడిపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రియాంక సమక్షంలో నీళ్ల పంచాయితీపై గొడవ జరిగిందని, ఇకనైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పంచాయతీ బావిలో వేసిన పైపులు


పైపులు ద్వారా పొలాలకు..


రాంచంద్రాపూర్ పంచాయతీ కార్యాలయం

చదువుల్లో రాణించినపుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: చదువుల్లో రాణించినపుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లో రాణించిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నతులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, కనకరాజు, శ్రీనివాస్, నాయకులు రామచంద్రం, రాములు, కిష్టయ్య, కృష్ణ, ఎల్లయ్య, సత్యనారాయణ, బాల్‌నర్సయ్య, మల్లయ్య, బాలయ్య, ఎల్లయ్య, యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన సహపంక్తి భోజనంలో సీఐ సైదాతో పాటు నాయకులు ముత్యాలు, కనకయ్య, సాగర్, మహేందర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఆకలి గోస తీర్చేందుకే సన్న బియ్యం పంపిణీ

కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి


సహపంక్తి భోజనం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): పేదల ఆకలి గోస తీర్చడానికే సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని బేగంపేటలో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి రైతు బాల్‌రాజయ్య ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిరుపేదలకు ఎంతో మేలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌స్వామిగౌడ్, అనసూయ, శంకర్, మధు, ప్రతాప్, కమలాకర్, సుమలత, బాలు యాదవ్, సతీశ్, రమేశ్, జగన్, స్వామి, వెంకటేశం, శ్రీధర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లిలో మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జగదీశ్వరచారి, మార్క అనిల్‌కుమార్, చంద్రమౌళి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో 2000–01 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా తాము చదువుకున్న పాఠశాలలో సందడి చేశారు. ఆనాటి ఘటనలను ఒకరితో ఒక్కరు పంచుకొన్నారు. అనంతరం విద్యా బుద్దులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రపంచంలోనే గొప్ప మేధావి అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణాలు, మండల కేంద్రాలలో వివిధ పార్టీల నాయకులు, దళిత, బీసీ సంఘాల నేతలు అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ అంబేడ్కర్ ప్రపంచంలోనే పెద్ద మేధావిగా గుర్తింపు పొందారని నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.


సిద్దిపేటకమాన్: కమిషనర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీసీపీ సుభాష్‌చంద్రబోస్, అధికారులు


గజ్వేల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు


హుస్నాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


దుబ్బాకలో నివాళులర్పిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


సిద్దిపేటఅర్బన్: ఎన్సాన్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న హరికృష్ణ


సిద్దిపేటజోన్: రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద మున్సిపల్ చైర్మన్ మంజుల తదితరులు


సిర్సనగండ్లలో యువజన సంఘం నాయకులు..


జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


దుబ్బాకరూరల్: నగరం గ్రామంలో..


చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్యల నివాళి


బెజ్జంకిలో ఎమ్మెల్యే కవ్వంపల్లి..


ములుగు(గజ్వేల్): కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీలో మాట్లాడుతున్న వీసీ రాజిరెడ్డి


సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ చందర్, సిబ్బంది


చిన్నకోడూరులో..

కొబ్బరికాయలు కొట్టేందుకు అర్హత ఎక్కడిది?

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): గత శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్ రానివాళ్లు కొబ్బరికాయలు కొట్టేందుకు ఆరాటపడుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని తుక్కాపూర్‌లో సోమవారం బీఆర్‌ఎస్ వజ్రోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడినవాళ్లు కొబ్బరికాయలు కొట్టడం సిగ్గుచేటన్నారు. 27న వరంగల్‌లో నిర్వహించే సభకు మండలం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, యాదగిరి, రాంరెడ్డి, కనకయ్య, అనిత, స్వామి, కలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు అందించే వరకు పోరాడుతా..

దుబ్బాకరూరల్: మండలంలోని వెంకటగిరి తండాలో నిర్వహించిన సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీడు భూములన్నింటికీ మల్లన్న సాగర్ కాలువల ద్వారా నీళ్లు అందించే వరకు పోరాడతానన్నారు. కార్యక్రమంలో బాలకిషన్, రాంజా, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు శ్రీరామ రక్ష కేసీఆరే..

దుబ్బాక: తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 27న జరిగే బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ బహిరంగసభ వాల్ పోస్టర్లను క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. వరంగల్‌లో జరిగే ఈ సభకు నియోజకవర్గం నుంచి 15 వేలకు పైగా ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాజమౌళి, శ్రీనివాస్, భూంరెడ్డి, ఖలీల్, కిషన్‌రెడ్డి, నరేశ్, కైలాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

మిరుదొడ్డి(దుబ్బాక): రాజ్యాంగాన్ని మార్చే కుట్ర పన్నుతున్న ఈ తరుణంలో రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పాటు పడాలని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామిగౌడ్ పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో సోమవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. డా.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేశం, సుమలత పాల్గొన్నారు.

ముందుకురావాలి..

తొగుట(దుబ్బాక): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకురావాలని కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర మండల ఇన్‌చార్జి అనంతుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఘనపురం, గుడికందుల, లింగంపేట గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. అక్కం స్వామి, కొండల్‌రెడ్డి, ఎల్లం నరేందర్‌రెడ్డి, రవీందర్, శ్రీనాకర్, భూపాల్‌రెడ్డి, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.


మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

సత్యసాయిబాబా సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: సత్యసాయిబాబా చేపట్టిన సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్‌లో సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రతియేటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల దాహార్తిని తీర్చుతున్న సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. నర్సింహులు, శ్రీధర్, గురువయ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో ఆదివారం కురిసిన వడగళ్ల వానకు నేలకొరిగిన వరి పొలాలను హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి సోమవారం పరిశీలించారు. పంతుల్ తండా పంచాయతీ పరిధిలో ఫకీర్‌తండా, తారచంద్‌తండాలో వరి పంటను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అయిలయ్యతో కలిసి సందర్శించారు. అధికారులు నివేదికలను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్లయ్య, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రవి, వ్యవసాయ విస్తరణాధికారి సబియా, నాయకులు రైనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి, అధికారులు